# అసలు కథ

## షాజహానా బేగం

ఈ కథ అ చ్చవుతుందో లేదో. అ చ్చయినా నువ్వు చదువుతావో లేదో. అసలు ఇది కథో, నాలోని అలజడికి రూపమో, ఒక భావ వీచికో, బాధల పల్లవో, ప్రేమ లేఖో - ఏమీ కాని వట్టి ఉన్మాద ప్రేలాపనో .... నాకే అర్థం కాని అయోమయ పరిస్థితి ....

మొదటి సారి నిన్ను చూసినప్పుడు శిలా ప్రతిమలా - చైతన్య రహితంగా - స్తంభించి పోయాను. రమణీయ దృశ్యాన్ని చూసినా, మధురమైన శబ్దాన్ని విన్నా - అది ఇంతకు పూర్వం పరిచయం లేని దయినా - జన్మాంతర బంధమేదో మనసును జ్ఞాపకాలతో బంధిస్తుందట.

నిశీధి లాంటి ఏకాంతా న్ని కావలించుకొని ఉన్న నాకు, నాలోంచి నన్ను తీసేసుకొని శూన్యంలా మిగిలిన నాకు, జీవన మాధుర్యాన్ని ఏ అగాధాల్లోకో గిరాటు వేసుకున్న నాకు ... ఇ న్నాళ్ళ నా తపస్సు ఫలించినట్టు - ఇ న్నాళ్ళ నా అన్వేషణ నీ కోసమే అయినట్టు ... నువ్వు కనిపించావు.

వెన్నెల కెరటాల మీంచి తేలి వచ్చే నురగలా - పాలూ మీగడ పూసిన పాలరాతి విగ్రహంలా - గ్రీకు సౌందర్య దేవత వీనస్‌లా - కావ్యాలన్నీ ఆకారం ధరించినట్టు గులాబీలు కుప్ప పోసినట్టు - మల్లెలన్నీ మంచులో విచ్చుకున్నట్టు నువ్వు కనిపించావు.

అన్నట్టు నీ పేరేమిటో అప్పుడే కాదు - ఇప్పటికీ నాకు తెలియదు. అయినా అందానికి పే రేమిటి - నన్నజాజికి మల్లే నువ్వు! ఎవరెస్టుకు పే రేమిటి - ఔన్నత్యానికి మల్లే నువ్వు! తాజ్‌మహల్‌కు పే రెందుకు - ప్రేమ చిహ్నానికి మల్లే నువ్వు!

నువ్వు నా వేపు కన్నెత్తి చూసి ఉంటే కోటి కవితలు రచించి ఉండే వాణ్ణి. నువ్వు నోరార ఒక్క మాట మాట్లాడి ఉంటే కోటి రాగాలు ఆలపించి ఉండేవాణ్ణి. అరమోడ్పు కన్నులే తప్ప విశాలమైన నీ కళ్ళు తెరచుకోగా నేను చూడ లేదు. పెదవులు కదలడమే తప్ప పెద్దగా మాట్లాడగా నేను వినలేదు.

"అంకుల్! కృష్ణశాస్త్రి గారి పుస్తకా లేమయినా ఉంటే ఇవ్వంది మమ్మీ.." అరటూ వచ్చాడు బాబు.

పాలు గారే లేత బుగ్గలు, చెంపకు చేరడేసి కళ్ళు, విల్లులా వొంగిన కనుబొమ్మలు - చిదిమి దీపం పెట్టుకోవాలనిపించే చిన్నారి రూపం బాబుది.

బాబును చూస్తుంటే నీ రూపమే మనసులో మెదిలింది. బాబు మాట్లాడుతుంటే నువ్వు మాట్లాడుతున్నట్టే అనుభూతి చెందాను.

"మమ్మీ కవిత్వం చదువుతుందా బాబూ.... ?" అడిగాను ఆసక్తిగా.

"ఏమో! పుస్తకాలు మాత్రం బోల్డు చదువుతుంది..." చిన్న బుంగ మూతితో ముద్దు ముద్దుగా అన్నాడు బాబు.

'అయితే నేను రాసిన కవిత్వం ఇస్తాను పట్టుకెళ్ళు' అన బోయి బలవంతాన ఆ ప్రయత్నం మానుకున్నాను - ఏ మనుకుంటుందో నని.

ఆ సాయంత్రం మీ పెరట్లో చూశాను. నిదురిస్తున్న పూల తోటలోకి పాట వచ్చినట్టు - అంతులేని ఎడారిలోకి వసంతం నడిచి వచ్చినట్టు - కలలా నువ్వు నడచి వస్తుంటే నీ పాదాలు ఎక్కడ కందిపోతాయోనని నా చూపులు పెరటి నిండా పరచాను.....

ఎందరు రూప వతులను చూడ లేదు? ఎ న్నెన్ని అపురూప అందాలను దర్శించ లేదు? నీ ముఖంలోని వర్చస్సు - సాత్వికత - నే నింత వరకూ చూడ లేదు. నీ కళ్ళలో ఎ న్నెన్ని యుగాల ప్రేమ గూడు కట్టుకొని ఉన్నదో! ఎ న్నెన్ని అగాధాలు తమ లోతుల్ని దాచుకున్నాయో! 'ఆమె కళ్ళలో అనంతాంబరపు నీలి నీడలు కలవు....' అని కృష్ణశాస్త్రి - ఏ జన్మలోనో - నిన్ను చూచే - అంత గొప్పగా చెప్పగలిగా డేమో! స్త్రీత్వం ఉట్టిబడే నీ వక్షాన్ని - అందానికే అందాన్నిచ్చే కటిస్థలినీ కలిపే తెల్లని నడుము దగ్గర నిశ్చింతగా తల పెట్టుకొని నిద్ర పోగలిగితే ..... తెల్ల గులాబీల్లాంటి నీ పాదాలను నా గుండెలపై పెట్టుకొని తనవితీరా ముద్దాడ గలిగితే ... ఈ కవిత్వాన్ని ... సాహిత్యాన్ని ... లోకాన్ని ... సర్వం మరచి నీ ఒడిలో పసిపాపలా వాలి పోవాలని ... నువ్వు లాలిస్తుంటే ఈ ప్రపంచాన్నే జయించినంతగా గర్వించాలని ..... ప్చ్.... !

కానీ నువ్వు చూడవు. ఆ సుశీల దొంగ చూపుల్ని ఎ ప్పుడయినా చూశావా? పెరట్లో నేను స్నానం చేస్తుంటే ఒళ్ళు తూట్లు పడేట్టు చూస్తుంది. మగా ణ్ణయినా సిగ్గుతో ముడుచుకు పోతాను. ఎర్రగా బుర్రగా పొడుగ్గా రివటలా - ములక్కాడ ల్లాంటి చేతులు ఊపుకుంటూ సూదుల్లాంటి చూపులతో ఒంటినిండా గుచ్చుతుంది.

కనీసం మాట్లాడనైనా మాట్లాడవు. సరస్వతి మాట్లాడుతుంటే విన్నావా? రెం డర్థాలతో, వ్యంగ్యార్థాలతో చెవులు చిల్లులు పడేలా మాట్లాడుతుంది. సరస్వతి అని ఎందుకు పేరు పెట్టారో గాని వాగ్దేవి ఆమె నోట్లో అపవిత్రం అవుతున్నది - నిరంతరం.

లక్ష్మి - మా ఇంటి ముందు చూసే ఉంటావు. మూగ జీవం! పిల్లల్ని కనడమే ఆమె జీవిత లక్ష్యం అన్నట్టు అదే పనిగా జనాభాను పెంచే ప్రయత్నంలో నిర్విరామంగా కృషి చేస్తున్నది. పాపం - సంతాన లక్ష్మి! అయినా ఆమె చూసే చూపులు - ఎందుకులే నా నోటితో చెప్పడం....

అందమంటే ... రమది కూడా చెప్పుకో దగ్గ అందమే. త్రాచు పాముది కూడా అందమే. అయితే రమది నిస్సం దేహంగా అందమే. కాని రమది మరీ పిటీ కేసు. కలలోని రాకుమారుడు ఇలలో దొరక్కపోవం పెద్ద అసంతృప్తి ఆమెకు. మొగుడితో కాక - చీరలతో, నగలతో, డబ్బుతో, అంతస్తులతో ఆమె కాపురం చేస్తుంది. కోరికలు తీరక పోవడం వల్లా - అసంతృప్తి వల్లా పర్వర్షన్ పెరిగిపోయి లోకం మీద కసి - ద్వేషం - పెంచుకున్నది. ప్రేమ రాహిత్యం ఆమె జీవితాన్ని అల్లకల్లోలం చేస్తున్నది. కనబడ్డ వారి నల్లా తిడుతుంది. ఎవరు సుఖంగా ఉన్నట్టు కన్పించినా అగ్నిపర్వతంలా విరుచుకు పడుతుంది.

నువ్వు నమ్ముతావో లేదో, ఈ నలుగురూ నన్ను కవ్విస్తూ, రెచ్చగొట్టిన వాళ్ళే. తన కోరికలు తీర్చే తాహతు నాకు లేదని తెలిసిం తర్వాత రమ నాకు దూరమై ద్వేషానికి దగ్గరయింది. నేను వేసే ప్రతి అడుగునూ వెన్నంటి పసిగడుతున్నది.

వీళ్ళంతా నా చుట్టు తిరుగుతూ నన్ను అల్లరి పెట్టాలని, ఆకర్షించాలని చేసే ప్రయత్నాలతో పిచ్చెక్కి నట్టయి - నా నుండి నేను దూరం పారి పోలేక - వీళ్ళకు దగ్గర కాలేక - మత్తులో మునిగి పోయేందుకు మార్గాలు వెతుక్కున్నాను. చిత్తుగా తాగి దేవదాసు నయ్యాను.

కవిత్వం కంటే మధురమైన అనుభూతినిచ్చే - మద్యం కంటే నిషా నిచ్చే - గులాబి కంటే అందమైన - సంపంగి కంటే పరిమళ భరితమైన పదార్థం ఒకటున్నదని నిన్ను చూశాకే తెలుసుకున్నాను. తాగుడుతో చచ్చిపోతావని అయిన వాళ్ళూ కాని వాళ్ళూ ఎన్ని విధాలుగా చెప్పినా - బ్రతుకు మీద విరక్తి కలిగిన నేనుససేమిరా విన లేదు.

నువ్వు కనిపించావు. నా మోడు బెడద మళ్ళీ చివురించింది. నాలోని జీవన లాలస మళ్ళీ పుష్పించింది. వసివాడి పోయిన నాలోని ప్రేమ మళ్ళీ గుబాళించింది. నీ ఒక్క చూపు కోసం - నీ ఒక్క దృష్టి కోసం - నీ మెప్పు కోసం - తాగుడుకు గుడ్‌బై చెప్పాను. మళ్ళీ మనిషి నయ్యాను. ఎండిపోయిన నా జీవన లతను ఆశలు పోసి పెంచుతున్నాను. తీగలు తెగిన ఈ బ్రతుకు వీణ నీ రాకతో కొత్త రాగాలు ఆలపిస్తున్నది.

గంధర్వ లోకం నుంచి దిగి వచ్చిన అప్సరలా - దారి తప్పిన ఒంటరి నక్షత్రంలా - ఆకాశం నుంచి నేల మీదకు వాలిన వెన్నెల కిరణంలా - పెరట్లో - నూతి పళ్ళెం దగ్గర - మెరుపులా నువ్వు ఒక్క క్షణం కనిపించినా - ఆ రూపాన్ని యుగాలైనా



చెదరి పోకుండా - ఎదలో పదిలంగా దాచుకుంటాను.

నీ చుట్టూ - కనిపించే గోడలతో పాటు, కనిపించని ఇనుప గోడ లున్నాయని నాకు తెలును. అయినా నా బేల మనసు వా టన్నిటినీ ఛేదించు కోవాలని సిద్ధ మవుతుంది. ఎందుకీ ఆరాటం.... నన్ను చూడగానే బాణంలా దూసుకు పోయే నిన్ను - విహ్వాలంగా ఎండు టాకులా వణికిపొయ్యే నిన్ను - చూడాలని ఎందుకీ ఆదుర్దా

కానీ నిన్ను చూడంధే ఉండలే నన్నది మాత్రం నిజం. నిన్ను చూడని రోజు పిచ్చె క్కుతుంది. ఏదో అశాంతి. ఏదో ఆవేదన కళ్ళలో దిగులు. గుండెలో గుబులు. ఏదో అమూల్యమైన వస్తువును పోగొట్టుకున్న భావన. గుండె గానుగలో నలిగి పోతున్న అనుభూతి....

నీ రూపం నన్ను ఎంతగా బంధించి వేసిందంటే, ఎంతగా ఆక్రమించిందంటే, ఎంతగా నాలో నిండి పోయిందంటే - అసలు నిన్ను తలచుకోని క్షణం లే దంటే నమ్ముత వో ... లేదో ....

క్లాసులో పాఠం చెబుతున్నాను....

మను చరిత్ర రసవత్తరంగా సాగుతున్నది. వరూధిని · అతిలోక సౌందర్యాన్ని పెద్దన ఆవిష్కరించిన విధానాన్ని గొప్ప రసోద్రేకంతో వర్ణించి చెబుతున్నాను. సూది పడితే వినిపించేంత నిశ్శబ్దం క్లాసులో... ప్రవాహంలా ఉపన్యాసం కొనసాగుతున్నది.... ఎక్కడ ... ఏం పొరపాటు దొర్లిందో నా కైతే తెలియదు. మైకంలో ఉన్న నేను - క్లా సంతా గొల్లున నవ్వగానే ముచ్చెమటలు పోసి .... క్లాసులోంచి వెళ్ళి పోయాను...

లంచ్ అవర్‌లో, సెకండ్ ఫ్లోర్ వరండాలో ఎదురయింది పద్మజా కుమారి. పద్మజ నవ్వుతున్నది ఎగతాళిగా....

నా కాళ్ళు సన్నగా వణుకుతూ లయ తప్పుతున్నాయి,

పద్మజ కాలేజీ బ్యూటీ. ముట్టుకుంటే మాసి పోయే అందం. గులాబీల రసాన్ని పారదర్శక పదార్థంతో కలిపి చేసిన బంగారు బొమ్మలా ఉంటుంది. ఆమెతో మాట్లాడ్డానికి స్టూడెంట్సే కాదు ప్రిన్సిపాల్‌తో సహా స్టాఫ్ అంతా ఎగబడతారు...

"ఏమండీ ప్రవరాఖ్యుడు గారూ! మీ పెరట్లోని వరూధిని అంత అందంగా ఉంటుందా? నేల మీద వాలిన వెన్నెల కిరణం అనీ, దారి తప్పిన ఒంటరి నక్షత్రం అనీ .... పాపం ... పాఠం చెబుతూ దారి తప్పారు ...." పద్మజ నవ్వుతూనే ఉన్నది ....

చుట్టూ చూశాను. ఎవ్వరూ లేరు - అదృష్టవశాత్తు. థాంక్ గాడ్ అనుకొని మెల్లగా జారుకున్నాను. క్లాసులో .... పాఠం చెబుతున్నా నీ ధ్యాసే నన్న మాట....

.... ఇంత వరకూ కథను బాగానే రాశాను. ఇక ఆపైన ఏం రాయాలో తోచడం లేదు. సిగరెట్ తీసి వెలిగించాను. కాగితాల మీద పేపర్ వెయిట్ పెట్టి ఓ రెండు నిమిషాలు అటూ ఇటూ పచార్లు చేశాను. లాభం లేదు. మెదడు మొద్దు బారినట్టనిపించింది. ఏ ఆలోచనా రావడం లేదు. ఈ కథను ఎలా ముగించాలి...? ఎంత గింజుకున్నా ఒక్క వాక్యం కూడా స్ఫురించడం లేదు. మూడ్ కుదిరి చావడం లేదు. ఒక కప్పు కాఫీ లోపల పడితే ప్రయోజనం ఉంటుందేమో ననిపించింది. లోనికెళ్ళి స్టౌ వెలిగించాను.

"హాయ్ అంకుల్! కథ రాశావా?" టేబుల్ మీది కాగితాలు చేతిలోకి తీసుకొని చూస్తూ అన్నాడు బాబు.

"బాబూ! ఆ కాగితాలు ముట్టుకో వద్దు.... అక్కడ పెట్టెయ్..." అని అరిచాను లోపల్నుంచే.

"కథ లంటే మా మమ్మీ కెంత ఇష్టమో... ఉండు మమ్మీకి ఇచ్చి వస్తాను ...." నా అంగీకారానికి ఎదురు చూడకుండానే కాగితాలు పట్టుకుని ఉడాయించాడు బాబు.

నా గుండెలు గుభిల్లు మన్నాయి. అంత చలిలోనూ ఒ ళ్ళంతా చెమటలు పట్టింది. నా గుండె చప్పుడు నాకే వినిపించేంత వేగంగా కొట్టుకుంటున్నది - గుండె.

ఏమవుతుందో? పట్టరాని ఎగ్జయిట్‌మెంట్. తట్టుకోలేని ఉత్కంఠ. ఆమె చదువుతుందా? చదివితే ఆమె రియాక్షన్ ఎలా ఉంటుంది? నిజంగా ఈ కథ ఆమెకు నచ్చడంలో ఎంత థ్రిల్ ఉంటుంది...! మనసు ఆందోళనతో, ఆదుర్దాతో గడియారం పెండ్యులం లా ఊగిస లాడుతున్నది...

కాగితాలు పట్టుకొని బాబు వచ్చాడు.

"మమ్మీ ... కథ చదివిందా?" అదుపు తప్పుతున్న గుండెను చేత్తో పట్టుకొని వణుకుతున్న కంఠంతో అడిగాను.

"ఊఁ..."

"ఏ మన్నది చదివి...?"

"ఏమో! మా మమ్మీ అప్పు డప్పుడు అర్థం లేని పనులు చేస్తుంటుంది... కథ చదివి ఇవ్వొచ్చు కదా... అమాంతం నన్ను ఒడిలోకి లాక్కొని ముద్దుల వర్షం కురిపించింది. పె ద్దాళ్ళు ఎప్పుడు ఏం చేస్తారో అస్సలు అర్థం కాదు...." గొణుక్కుంటూ చెప్పాడు బాబు.

ఒక్క సారిగా నా రక్తం జలపాత వేగం అందుకుంది.

"ఓహ్.... బాబూ...! వాట్ ఏ లక్కీ ఫెలో ఐయామ్...." బాబును గాలిలో గిరగిరా తిప్పుతూ ముద్దులతో తడిపేశాను.

"మా మమ్మీకి - మీకూ - ఏమయింది ఇవ్వాళ...?" ఒళ్ళంతా తుడుచుకుంటూ అమాయకంగా అడిగాడు బాబు.

ఏమయిందని చెప్పను? కథ అర్థం కావడానికి నీకు ఇంకో పన్నెం డేండ్లయినా పడుతుంది అనీ, అసలు కథ అర్థం కావడానికి ఎన్నేండ్లు పడుతుందో - అనీ చెప్పనా?

★